అకాల వర్షం.. అపార నష్టం

● ఆదుకోవాలంటున్న రైతులు, బాధితులు

వెల్దుర్తి(తూప్రాన్): మండలంలోని పలు గ్రామాల్లో తీవ్ర నష్టం వాటిల్లింది. శుక్రవారం సాయంత్రం నుంచి అర్ధరాత్రి దాటే వరకు ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం పడింది. దీంతో పంట చేతికొచ్చే సమయంలో మామిడికాయలన్నీ నేలరాలాయి. మరోవైపు కల్లాల్లో ఆరబోసిన వడ్లు తడిసి ముద్దయ్యాయి. అప్పులు చేసి పంటకు పెట్టుబడిగా పెడితే.. కనీసం పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదని రైతన్నలు వాపోతున్నారు. మండలంలోని ఆరెగూడెంలో ఈదురుగాలుల తీవ్రత ఎక్కువగా ఉండడంతో నష్టం భారీగానే సంభవించింది. గ్రామానికి చెందిన కుక్కల జోగులుకు చెందిన పౌల్ట్రీ షెడ్ పూర్తిగా ధ్వంసమైంది. గొల్ల శ్రీనుకు చెందిన గొర్రెల షెడ్ కూడా ధ్వంసమైంది. ఎల్కపల్లిలో సాతెల్లి కిష్టయ్య నివాస గుడిసె పూర్తిగా నేలమట్టమైంది. ప్రమాద సమయంలో కిష్టయ్య తల్లి ఇంట్లోనే ఉండగా పెను ప్రమాదం తప్పింది. వెల్దుర్తి-కుకునూర్ ప్రధాన రహదారిపై భారీవృక్షం నేలకూలడంతో రాకపోకలకు ఇబ్బంది తలెత్తింది. ఎల్కపల్లి గ్రామ శివారులోనే విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ ధ్వంసమైంది. పలుచోట్ల విద్యుత్ స్తంభాలు విరిగిపోయాయి. దీంతో సాయంత్రం నుంచి విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. శనివారం గిర్దావర్ నర్సింగ్ యాదవ్ పలుగ్రామాల్లో పర్యటించి నష్టతీవ్రతపై వివరాలు సేకరించారు. ప్రభుత్వం స్పందించి ఆర్థికసాయం అందించి ఆదుకోవాలని బాధితులు వేడుకుంటున్నారు.


ఆరెగూడెంలో ధ్వంసమైన పౌల్ట్రీ షెడ్


ఎల్కపల్లిలో ధ్వంసమైన నివాసగుడిసె

రెండు వారాలైనా కొనుగోళ్లు ఏవీ..?

చేగుంట(తూప్రాన్): కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి 15 రోజులు గడిచినా.. ధాన్యం తూకం వేసుకోవడం లేదని రాంపూర్ గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మండలంలోని రాంపూర్ గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో 15 రోజుల క్రితం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి, నాటి నుంచి నిర్వాహకులు కొనుగోళ్ల ప్రక్రియను ప్రారంభించలేదని ఆందోళన చెందుతున్నారు. రైతులు ధాన్యం వద్దనే కాపాల ఉండటంతో పాటు అకాల వర్షంకు ధాన్యం తడిసిపోయే అవకాశం ఉందన్నారు. అధికారులు వెంటనే కొనుగోలు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని వాపోయారు. మక్కరాజీపేట గ్రామంలో సహకార సంఘం ఆధ్వర్యంలో కొనుగోలు ప్రారంభించినా.. వసతులు లేకపోవడం వాచ్‌మెన్‌ను ఏర్పాటు చేయక పోవడంతో టాపర్లతో పాటు ధాన్యం చోరీకి గురవుతుందన్నారు. కొనుగోలు కేంద్రం వద్ద సమస్యలు పరిష్కరించకుంటే రస్తారోకో చేస్తామన్నారు.


రాంపూర్‌లో ఆరుబయట ఉన్న ధాన్యం కుప్పలు

సొంత నిధులతో సీసీ పనులు


సీసీ రోడ్డు పనులు

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రం శివ్వంపేట గ్రామం నుంచి ప్రధాన హైవే పైకి వచ్చేందుకు వాహనదారులు, ప్రజలకు ఇబ్బందికరంగా ఉన్న విషయం గురించి సాక్షి దినపత్రికలో నెలలో రోడ్డు ఎత్తుతో నిత్య ప్రమాదాలు కథనం ప్రచురితమైంది. అందుకు గాను మాజీ జెడ్పీటీసీ పబ్బ మహేశ్‌గుప్తా స్పందించారు. రూ.లక్ష యాభై వేల తన సొంత నిధులతో ప్రమాదకరంగా ఉన్న రోడ్డుపై శనివారం సీసీరోడ్డు వేయించి ఎత్తుపల్లాలను సరిచేశారు. దీంతో గ్రామం నుంచి తూప్రాన్ – నర్సాపూర్ హైవే పైకి వచ్చేందుకు వాహనదారుల ఇబ్బందులు తొలగిపోవడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. ప్రజల సమస్యలు పరిష్కరించడంలో తన కృషి ఎప్పటికీ ఉంటుందని మహేష్‌గుప్తా అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్‌గౌడ్, లక్ష్మీనర్సయ్య, కొండల్, పోచగౌడ్, వెంకటేష్, అశోక్, రాములుగౌడ్, త్రినేష్‌గౌడ్, సింహం, గౌండస్వామి, నాగరాజు, రవినాయక్, అర్జున్, సాయికుమార్, తదితరులు ఉన్నారు.

గ్రామదేవత ఆలయ చెట్టు నరికివేత

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రం చేగుంటలోని నల్లపోచమ్మ గ్రామ దేవత ఆలయ చింతచెట్టు నరికిన వారిపై చర్యలు తీసుకోవాలని రెవెన్యూ అధికారులకు గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. నల్లపోచమ్మ ఆలయంలో వందేళ్లకు పైబడిన చింతచెట్టు ఉండగా, తమ నిర్మాణాలకు అడ్డుగా ఉందనే సాకుతో రియల్ వ్యాపారులు శనివారం చెట్టును నరికేశారు. ఈ విషయంలో ఆగ్రహించిన భక్తులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయగా, ఆర్ఐ సంతోష్ ఆలయం వద్దకు చేరుకొని పంచనామా నిర్వహించారు. ఉన్నతాధికారుల ఆదేశాలు వచ్చే వరకు నరికివేసిన చింత చెట్టు కొమ్మలు అక్కడే ఉంచాలని రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సంతోష్ పేర్కొన్నారు.


పోచమ్మ ఆలయ చింతచెట్టు

వేసవిలో జాగ్రత్తగా ఉండాలి

పీహెచ్‌సీ డాక్టర్ హరిప్రియ


మాట్లాడుతున్న ఎంపీడీవో సజీలుద్దీన్

రామాయంపేట(మెదక్): వేసవిలో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, సాధ్యమైనంతమేర ఎండలో తిరుగొద్దని మండలంలోని ప్రగతి ధర్మారం పీహెచ్‌సీ డాక్టర్ హరిప్రియ సూచించారు. శనివారం మండల కార్యాలయంలో జరిగిన ఎంపీపీ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందరభంగా ఆమె మాట్లాడుతూ.. వడదెబ్బ సోకిన వారికి వెంటనే వైద్యసేవలు అందజేయాలని ఆదేశాలు జారీ చేశామని, ఈమేరకు ఏఎన్ఎంలు, ఆశలు గ్రామాల్లో పర్యటిస్తున్నారని తెలిపారు. డ్వాక్రా గ్రూపు సభ్యులు ప్రతీ నెలా విధిగా రుణాలు చెల్లించాలని ఏపీఎం రాములు అన్నారు. వచ్చే విద్యా సంవత్సరంలో విద్యార్థులకు రెండు జతల దుస్తులు ఇస్తామని ఎంఈఓ శ్రీనివాస్ వివరించారు. వేసవి దృష్ట్యా గ్రామాల్లో తాగునీటి ఎద్దడి సమస్య తలెత్తకుండా ముందస్తూ చర్యలు తీసుకుంటున్నామని, ప్రస్తుతానికి ఏ గ్రామంలో కూడా నీటి ఎద్దడి సమస్య తలెత్తలేదని భగీరథ అధికారి కిరణ్ వెల్లడించారు. ఎంపీడీవో సజీలుద్దీన్ మాట్లాడుతూ.. గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు సాఫీగా కొనసాగేలా చూడాలని కార్యదర్శులకు సూచించారు. కరెంట్ వైర్ల కింద ఉన్న చెట్ల కొమ్మలు కట్ చేస్తామని, గ్రామాల్లో తమకు సహకరించాలని ప్రజలను ట్రాన్స్‌కో ఏఈ తిరుపతిరెడ్డి సూచించారు.

అక్రమ నిర్మాణాలు తొలగింపు

వెల్దుర్తి(తూప్రాన్): మాసాయిపేట మండలం బొమ్మారం గ్రామ శివారులోని కుమ్మరికుంట బఫర్ జోన్‌లో ఏర్పాటు చేసిన ప్రహరీని శనివారం రెవెన్యూ అధికారులు తొలగించారు. కుంట శిఖం భూమిలో అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్నారని ఇటీవల గ్రామస్తులు అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో విచారణ చేపట్టిన అధికారులు ప్రహరీ ఏర్పాటు చేసిన స్థలం పట్టా భూమి అయినప్పటికీ సదరు భూ యజమాని నిబంధనలకు విరుద్ధంగా శాశ్వత నిర్మాణాలు చేపట్టడంతో వాటిని తొలగించినట్లు గిర్దావర్ ధన్‌సింగ్ తెలిపారు. బఫర్ జోన్‌లో ఎలాంటి శాశ్వత నిర్మాణాలు చేపట్టరాదని, తాత్కాలికంగా జాలి ఫెన్సింగ్ ఏర్పాటు చేసుకుంటే ఎలాంటి అభ్యంతరం ఉండదన్నారు. గిర్దావర్ వెంట సర్వేయర్ నర్సింలు ఉన్నారు.


ప్రహరీ సిమెంట్ పలకలను తొలగించిన అధికారులు

రేపటి నుంచి ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు


ముస్తాబైన నూతన ఎల్లమ్మ ఆలయం

టేక్మాల్(మెదక్): మండలంలోని బొడ్మట్‌పల్లిలో రేణుకా ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు సోమవారం నుంచి నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈనెల 28న గణపతి పూజ, పుణ్యా వచనం, ధ్వజారోహణం, జలాధివాసం, అగ్ని ప్రతిష్ఠ, మండప ఆరాధన,దేవత అర్చన, గణపతి పూజ, 29న ఆవాహిక దేవతల అర్చన స్థాపిత దేవతల ప్రతిష్ఠ హవనములు, ధాన్యాదివాసం, శయ్యాదివాసం, పుష్పాదివాసం, ఫలాదివాసం, 30న రోహిణి నక్షత్ర యుక్త మిధున లగ్నములో యంత్ర ప్రతిష్ఠ, క్షేత్రపాలక బలి, పూర్ణాహుతి, అమ్మ వారి కల్యాణోత్సవం, 1న లందజోగు, గంగ బోనం, సాయంత్రం బోనాల ఘటం, 2న ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

ప్రజలు కాంగ్రెస్‌ను నమ్మడం లేదు

మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

పెద్దశంకరంపేట(మెదక్): అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీని ప్రజలు నమ్మడం లేదని నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని కొత్తపేట, మాడ్సెట్‌పల్లి, రాఘవానితాండాలకు చెందిన మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలు, నాయకులు మాజీ ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా భూపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. రాబోయే ఎన్నికల్లో మళ్లీ బీఆర్ఎస్ అధికారంలోకి వస్తుందన్నారు. ఆదివారం నిర్వహించే భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శ్రీనివాస్, మాజీ వైస్ ఎంపీపీ లక్ష్మీరమేష్, సురేశ్‌గౌడ్, సుభాష్, శంకరయ్య, పరమేశ్వర్‌రెడ్డి, శంకర్‌గౌడ్, అంజయ్య, నర్సింలు తదితరులు ఉన్నారు.


బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్న కొత్తపేట గ్రామస్తులు

శనైశ్చరుడికి అదనపు కలెక్టర్ పూజలు


వెల్మకన్నలో శనైశ్చరుడికి పూజలు చేస్తున్న అదనపు కలెక్టర్ నగేష్


శనేశ్వరునికి పూజల్లో పాల్గొన్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సుహాసినిరెడ్డి

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని వెల్మకన్నలో శనైశ్చరుడికి శనివారం శనిత్రయోదశి సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ నగేష్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సుహాసినిరెడ్డి తైలాభిషేకంతో పాటు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ పురోహితులు ఉమాశంకరశర్మ, రవిప్రసాద్‌శర్మ శనైశ్చరుడికి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఆలయంవద్ద భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రాజేందర్, వివిధ గ్రామాల భక్తులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలో ఈసీసీఈ దినోత్సవం

తూప్రాన్: పట్టణంలోని 7వ అంగన్‌వాడీ కేంద్రంలో ఈసీసీఈ దినోత్సవం సెక్టార్ సూపర్‌వైజర్ శివకుమారి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా 3 నుంచి 6 సంవత్సరాలలోపు చిన్నారులు నేర్చుకున్న అన్ని కార్యక్రమాలను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. చిన్నారులకు అంగన్‌వాడీ టీచర్ ప్రతీరోజు పరిశీలించి, వారి అభివృద్ధిని గుర్తించాలని తెలిపారు. చిన్నారుల నైపుణ్యతను వారి తల్లులకు చూపించాలని సూచించారు. గ్రాడ్యుయేషన్ డే లో భాగంగా ఐదు సంవత్సరాలు నిండిన పిల్లలు ప్రైమరీ స్కూల్‌కు వెళ్లటకు సిద్ధంగా ఉన్నవారికి అసైన్‌మెంట్ కార్డు (ప్రోగ్రెస్ కార్డు) ఇచ్చామన్నారు. ఈ కార్యక్రమంలో అంగర్‌వాడీ టీచర్ ఇందిరా, గర్భిణులు, బాలింత తల్లులు, ఆయా సుజాత పాల్గొన్నారు.


అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులతో సూపర్‌వైజర్ శివకుమారి, తల్లులు

ప్రభుత్వ పాఠశాలలో చదివిద్దాం


ప్రభుత్వ పాఠశాలలోనే చదివించాలని కోరుతున్న ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు

చిన్నశంకరంపేట(మెదక్): ప్రభుత్వ పాఠశాలలో చదివిద్దాం.. ప్రభుత్వ బడిని కాపాడుకుందామని నార్సింగి మండలం శేరిపల్లి గ్రామంలో ఇంటింటికీ తిరిగి విద్యార్థుల తల్లిదండ్రులను ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు అభ్యర్థించారు. శనివారం శేరిపల్లి గ్రామ ప్రాథమిక పాఠశాల, జెడ్పీపాఠశాల ఉపాధ్యాయులు, గ్రామ మాజీ సర్పంచ్‌లు, యువజన సంఘాల సభ్యులు ముందుకొచ్చి ఇతర పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల ఇళ్లవద్దకు వెళ్లి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివించాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం వీరేందర్ మాట్లాడుతూ.. గుణాత్మక విద్యతో పాటు నాణ్యమైన విద్యను అందించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని హామీ ఇచ్చారు. ప్రభుత్వ పాఠశాలలో డిజిటల్ విద్యబోధన, సకల సౌకర్యాలు ఉన్నాయని, విద్యార్థుల తల్లిదండ్రులు సహకరించి విద్యార్థులను గ్రామంలోని ప్రభుత్వ బడిలో చేర్పించాలని కోరారు. విద్యార్థులను ఈర్చి దిద్దడంలో తాము ముందుంటామని, ప్రైవేట్ పాఠశాలను మించిన బోధనను అందిస్తామని భరోసా కల్పించారు. ఇప్పటికే కొందరు విద్యార్థులు తల్లిదండ్రులు ముందుకొచ్చారు. మరి కొందరు కూడా ముందుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు లింగం, జగన్, రాజు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ స్వప్న, మాజీ సర్పంచ్‌లు మల్లేశం, రమేశ్, మాజీ ఉపసర్పంచ్‌లు రమేశ్, బాలాజీ, గ్రామ నాయకులు చంద్రంగౌడ్, లక్ష్మీనర్సింహులు, స్వామి, యాదగిరి పాల్గొన్నారు.

కోనాపూర్‌లో బడిబాట


బడిబాటలో పాల్గొన్న ఉపాధ్యాయులు

రామాయంపేట(మెదక్): మండలంలోని కోనాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు శనివారం ముందస్తుగా బడిబాట నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు విద్యార్థుల ఇళ్ల వద్దకు వెళ్లి, తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో చేరే విద్యార్థులకు రెండు జతల యూనిఫామ్స్‌తో పాటు మధ్యాహ్న భోజనం, కంప్యూటర్ విద్య, బాలికలకు కరాటేలో శిక్షణ అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవో శ్రీనివాస్, ఉపాధ్యాయులు, అమ్మ ఆదర్శ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

మండలంకు 382 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు

శివ్వంపేట(నర్సాపూర్): మండలానికి 382 ఇందిరమ్మ ఇళ్లు మంజూరైనట్లు కాంగ్రెస్ నాయకులు నవీన్‌గుప్తా, కరుణాకర్‌రెడ్డి శనివారం అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా.. వాటిని అసలైన లబ్ధిదారులకు ఇందిరమ్మ కమిటీల ద్వారా ఇస్తామన్నారు. గతంలో శభాష్‌పల్లి గ్రామానికి పైలెట్ ప్రాజెక్టు కింద 40 ఇళ్లు వచ్చాయని సంబంధిత లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభించిన విషయం గుర్తు చేశారు.

ఎస్టీయూ మండల అధ్యక్షుడిగా సతీష్



చిన్నశంకరంపేట(మెదక్): మండల ఎస్టీయూ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడిగా సీహెచ్.సతీష్(యూపీఎస్, జంగరాయి) ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పోచయ్య తెలిపారు. చిన్నశంకరంపేట ఎస్టీయూ మండలాధ్యక్షుడిగా పనిచేసిన గోపాల్ పదవి విరమణ చేశారు. దీంతో నూతన అధ్యక్షుడిని ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో అప్పగించిన పదవికి న్యాయం చేస్తానని, ఉపాధ్యాయ సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తానని తెలిపారు.

మండలానికి ఇందిరమ్మ ఇళ్లు ఎన్నంటే?

కొల్చారం(నర్సాపూర్): మండలానికి మొదటి విడత కింద మొత్తం 317 ఇందిరమ్మ ఇల్లు మంజూరయ్యాయి. వీటికి అదనంగా మరో 20 శాతం మంజూరు అవకాశం ఉందని అధికారులు చెబున్నారు. గ్రామాల్లో ఇందిరమ్మ కమిటీలు అర్హులను గుర్తించే పనిలో నిమగ్నమయ్యారు. ప్రస్తుతం మంజూరైన ఇళ్లు ఎంమాత్రం సరిపోతాయన్నది ఇటు అధికార అటు ప్రతిపక్షాల పార్టీల్లో వినిపిస్తుంది. అర్హులను గుర్తించడంలో సవా లక్ష అర్హతలు పెట్టడంతో ఇన్నాళ్లు సొంత ఊరు నిర్మించుకోవాలనుకున్న తమకు ఇందిరమ్మ ఇల్లు వస్తుందా అన్న సందేహంలో చాలా మంది లబ్ధిదారులు ఆశాభావంతో ఉన్నారు. మండలంలోని గ్రామాన్ని వారిగా మంజూరైన ఇందిరమ్మ ఇళ్లు అంసాన్పల్లి 5, నాయిని జలాల్పూర్ 6, వెంకటాపూర్ 9, ఏటిగడ్డ మాందాపూర్, పైతర, తుక్కాపూర్, వసురాం తండా 10, అప్పాజీపల్లి, సీతారాం తండా 11 చొప్పున, కోనాపూర్ 12, కొంగోడ్ 13, రాంపూర్ 14,అప్పాజీపల్లి 15, కిష్టాపూర్ 16, చిన్న ఘనాపూర్, పోతంశెట్టిపల్లి 20, వరిగుంతం, ఎనగండ్ల 25, కొల్చారం 29, రంగంపేట 30 ఉన్నాయి.


సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ

చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి మండలంలోని శేరిపల్లి గ్రామంలో కాంగ్రెస్ నాయకులు సీఎంఆర్ఎఫ్ చెక్కును పంపిణీ చేశారు. శనివారం శేరిపల్లి గ్రామానికి చెందిన పోకల శ్రీశైలం అనారోగ్య సమస్యతో బాధపడి చికిత్స చేయించుకోగా, రూ.34 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును అందించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు జంగర్ల గోవర్ధన్ మాట్లాడుతూ.. మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ సహకారంతో సీఎంఆర్‌ఎఫ్ చెక్కు మంజూరైందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చిన్న కృష్ణాగౌడ్, లక్ష్మీనర్సింహులు, భరత్, జయరామ్‌గౌడ్, అశోక్‌గౌడ్, బాలకృష్ణాగౌడ్ పాల్గొన్నారు.


నార్సింగి మండలం శేరిపల్లిలో చెక్కును అందిస్తున్న కాంగ్రెస్ నాయకులు

సంక్షిప్త వార్తలు

◆ వరంగల్ సభకు భారీగా తరలి రావాలి



కౌడిపల్లి(నర్సాపూర్): ఈనెల 27న వరంగల్‌లో జరిగే బీఆర్ఎస్ పార్టీ వజ్రోత్సవ బహిరంగ సభకు ప్రజలు, కార్యకర్తలు, నాయకులు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని మండలాధ్యక్షుడు రామాగౌడ్ తెలిపారు. కార్యక్రమంలో మండల మాజీ ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్, నాయకులు శ్యాంసుందర్‌రావ్, రవిసాగర్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

◆ చెక్కు పంపిణీ

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని వెల్మకన్న గ్రామానికి చెందిన చాకలి సందీప్‌కు రూ. 54వేలు సీఎంఆర్ఎఫ్ చెక్కు శనివారం మాజీ ఎంపీపీ ఉపాధ్యక్షుడు నవీన్‌గుప్తా పంపిణీ చేశారు.

◆ వాటర్ కూలర్ అందచేత

నర్సాపూర్: పట్టణంలోని పోలీస్ స్టేషన్‌కు వ్యాపారి శ్రీధర్‌గుప్తా వాటర్ కూలర్ శ్రీపాద ట్రస్ట్ ఆధ్వర్యంలో అందజేశారు. ఈ సందర్భంగా శ్రీధర్‌గుప్తాకు ఎస్ఐ లింగం ధన్యవాదాలు తెలిపారు.



క్లుప్తంగా

నేడు జెండా ఆవిష్కరించాలి


మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

శివ్వంపేట(నర్సాపూర్): బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆదివారం అన్ని గ్రామాల్లో పార్టీ జెండాలు ఆవిష్కరించాలని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రమణగౌడ్ అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. ఆదివారం వరంగల్‌లోని ఎలుకతుర్తి వద్ద జరుగు బీఆర్ఎస్ సభకు కార్యకర్తలు, నాయకులు, ప్రజలు భారీగా తరలిరావాలి కోరారు. ఉదయం 10 గంటల వరకు అన్ని గ్రామాల నుండి మండల కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్‌గుప్తా, శేఖర్‌గౌడ్, లక్ష్మీనర్సయ్య, నరేందర్, అశోక్, కొండల్, దశరథ్, ముత్యం రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కూలీల హాజరు పెంచాలి


మాట్లాడుతున్న ఎంపీడీఓ విఠల్‌రెడ్డి

పెద్దశంకరంపేట(మెదక్): ఉపాధిహామీ పనుల్లో కూలీల హాజరుశాతం పెరిగేలా ఈజీఎస్ సిబ్బంది, గ్రామ కార్యదర్శులు చర్యలు తీసుకోవాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ విఠల్‌రెడ్డి అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ఈజీఎస్ సిబ్బంది, గ్రామ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. నర్సరీల నిర్వాహణ, తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని, విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దని సూచించారు. కార్యక్రమంలో ఈజీఎస్ ఏపీఓ సంతోష్‌కుమార్ తదితరులు ఉన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వే


ఇందిరమ్మ ఇళ్ల సర్వే చేస్తున్న కార్యదర్శి

పెద్దశంకరంపేట(మెదక్): మండలంలోని ఆయా గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల సర్వే కొనసాగుతోంది. పెద్దశంకరంపేట మండల కేంద్రంలో 135 ఇళ్లు మంజూరయ్యాయి. గతంలో దరఖాస్తు చేసుకున్న వారి ఇళ్ల వద్దకు అధికారులు శనివారం వెళ్లి వారి స్థితిగతులను పరిశీలించి, వివరాలను నమోదు చేస్తున్నారు. అర్హులైన వారికి ఇళ్ల కట్టడంపై అవగాహన కల్పిస్తున్నారు. కార్యక్రమంలో సూపరిండెంటెండ్ షకీల్, గ్రామకార్యదర్శి వెంకటరాములు, సిబ్బంది నందు తదితరులున్నారు.

వివరాల సేకరణ


చెట్లతిమ్మాయిపల్లిలో ఎగిరిపోయిన రేకుల ఇళ్లను పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు

చేగుంట(తూప్రాన్): మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం రాత్రి కురిసిన గాలివానతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. చందాయిపేట గ్రామంలో ఆరబోసిన ధాన్యం తడిసిపోగా రెడ్డిపల్లి గ్రామంలో పిడుగు పాటుకు మంద సత్యనారాయణకు చెందిన పాడిగేదె మృతి చెందింది. మాసాయిపేట మండలం చెట్లతిమ్మాయిపల్లి గ్రామంలో కెతావత్ బానీ, బర్మావత్ బుజ్జిలకు చెందిన రేకుల ఇళ్లకు చెందిన పైకప్పులు ఎగిరిపోయాయి. రెవెన్యూ అధికారులు గాలివానకు సంబంధించిన నష్ట వివరాలను సేకరించి, నమోదు చేసుకున్నారు.

ఉగ్రదాడి పిరికిపంద చర్య


దిష్టి బొమ్మ దహనం చేస్తున్న యువకులు

వెల్దుర్తి(తూప్రాన్): జమ్మూ కాశ్మీర్‌లో జరిగిన ఉగ్రదాడి నిరసిస్తూ మండలంలోని బండపోసాన్‌పల్లి గ్రామంలో యువకులు, చిన్నారులు భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ గ్రామం నుంచి రామాయిపల్లి వరకు చేపట్టి బస్టాండ్ వద్ద ఉగ్రవాదుల దిష్టి బొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దాడికి పాల్పడిన వారిని గుర్తించి ఉరిశిక్ష విధించాలని డిమాండ్ చేశారు. భారతదేశం నుంచి ఉగ్రమూకలను తరిమి కొట్టాలన్నారు.